సాక్షి సంగారెడ్డి

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



ధాన్యం దళారుల పాలు

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం దళారులపాలవుతోంది.

వివరాలు 8లో ▸



మట్టి పరీక్ష.. పంటకు రక్ష

పంటలు సాగు చేసే రైతులకు అధిక దిగుబడి రావాలంటే భూమి సారవంతంగా ఉండాలి.

వివరాలు 8లో ▸



రాష్ట్రంలో 12వ స్థానం

ఆస్తిపన్ను వసూళ్లలో బొల్లారం మున్సిపాలిటీ జిల్లాలో ప్రథమం, రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఖేడ్ తహసీల్దార్‌గా హసీనాబేగం



నారాయణఖేడ్: ఖేడ్ తహసీల్దార్‌గా హసీనాబేగం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన సి.భాస్కర్ కంగ్టి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లగా మొగుడంపల్లి తహసీల్దారుగా పనిచేస్తున్న హసీనాబేగం ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆమె ఇక్కడ బాధ్యతలను స్వీకరించగా.. డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ తోపాటు ఆర్‌ఐ మాధవరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు.

డిజిటల్ భిక్షాటన



యూపీఐ స్కానర్ ద్వారా బెగ్గింగ్ చేస్తున్న శ్రీను

నారాయణఖేడ్: భిక్షాటనను డిజిటలైజ్ చేసిన అంశాన్ని సినిమాల్లో, సీరియల్స్‌ల్లో కామెడీ సీన్‌గానే ఇన్నాళ్లు చూశాం. కానీ అన్ని రంగాల్లో అప్‌డేటెడ్ అవుతున్న తరహాలోనే ఓ బిచ్చగాడు అప్‌డేటెడ్ అయి సినిమా సీన్‌ను నిజం చేశాడు. మహారాష్ట్రలోని బాల్కికి చెందిన శ్రీను (21) తలలో డప్పు వేసుకొని ఆడుక్కొంటూ డప్పుకు ఏకంగా డిజిటల్ యూపీఐ స్కానర్‌ను ఏర్పాటు చేశాడు. చిల్లర లేవని ఎవరైనా పంపిస్తే ఫోన్‌పే, లేదా గూగుల్ పే ద్వారా స్కాన్ చేసి ధర్మం చేయడంటూ కోరుతున్నాడు. సంత రోజుల్లో నారాయణఖేడ్, శంకర్‌పల్లి, జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, హైదరాబాద్, బీదర్, ఉద్గీర్ తదితర పట్టణాల్లో భిక్షాటన చేస్తానని తనకు నిత్యం రూ.800కు పైగా గిట్టుబాటు అవుతుందని తెలిపాడు. డిజిటల్ బెగ్గింగ్‌ను చూసి వ్యాపారులు నవ్వుకుంటూ యూపీఐ స్కాన్ చేసి మరీ డబ్బులు చెల్లిస్తున్నారు.

మూల్యాంకనంపై ఆరా



ఉపాధ్యాయులతో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రామచంద్రపురం (పటాన్‌చెరు): రామచంద్రపురం పరిధిలోని సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాలలు జరుగుతున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని మంగళవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషనల్ ఈవీ నరసింహారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు అధికారులు సందర్శించారు. మూల్యంకన కేంద్రంలోని బోధన, బార్ కోడింగ్ గదులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ లింబాజీ పాల్గొన్నారు.

డీకే అరుణను కలిసిన రైతు హక్కుల నేతలు



డీకే అరుణను కలిసి కృతజ్ఞతలు తెలుపుకుంటున్న వక్ఫ్ భూ బాధిత రైతులు

జహీరాబాద్: పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణను జహీరాబాద్‌కు చెందిన రైతు హక్కుల సాధన సమితి నాయకులు, వక్ఫ్ భూ బాధిత రైతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రాత్రి డీకే అరుణను ఆమె నివాసంలో కలిశారు. ఉభయ సభల్లో వక్ఫ్ బిల్లు పాస్ అయిన సందర్భంగా ఆమెకు స్వీటు తినిపించారు. జేపీసీ కమిటీ సభ్యురాలిగా ఉన్న ఆమె రైతుల తరపున తగిన సమాచారం సేకరించి కమిటీకి అందజేశారు. రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

వైభవంగా జోగినాథ రథోత్సవం

జోగిపేట (అందోల్): జోగిపేటలో జోగినాథ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు కొనసాగింది. ఐదు అంతస్తులలో నందీశ్వరుడు, గణపతి, శివలింగం, దుర్గామాత, జోగినాథ స్వామి దివ్యమూర్తులను ఏర్పాటు చేశారు. మొదటగా గొనిచౌరస్తాలో సంప్రదాయాల ప్రకారం జోగినాథ రథోత్సవ కమిటీ అధ్యక్షుడు శివశంకర్, కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిన్నారం ఇక బల్దియా..!

జిల్లాలో మరో కొత్త మున్సిపాలిటీ

- ప్రభుత్వానికి కలెక్టరేట్ నుంచి ప్రతిపాదనలు
- జిన్నారం, తొమ్మిది గ్రామాలతో కలిపి ఈ మున్సిపాలిటీ ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో మరో కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు కాబోతోంది. జిన్నారం మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా చేస్తూ జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జిన్నారంతో పాటు తొమ్మిది గ్రామాలను కలిపి ఈ మున్సిపాలిటీగా ఏర్పాటు కానుంది. జిన్నారం, కొడకంచి, ఊట్ల, శివనగర్, సోలక్‌పల్లి, నల్తూరు, రాళ్లకత్వ, అండూర్, జంగంపేట, మంగంపేట గ్రామాలు కలిపి కొత్త బల్దియాగా రూపాంతరం చెందనుంది. మొత్తం 17,956 మంది జనాభా ఈ మున్సిపాలిటీ పరిధిలో ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటికే ఈ మండలంలో గడ్డపోతారం గ్రామాన్ని మున్సిపాలిటీగా చేసిన విషయం విదితమే. తాజాగా జిన్నారంను కూడా మున్సిపాలిటీగా మారుస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

జిన్నారం మొత్తం అర్బన్ మండలమే..

జిన్నారం మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన గడ్డపోతారం మున్సిపాలిటీలో ఐదు గ్రామపంచాయతీలను విలీనం చేశారు. ఇప్పుడు మిగిలిన పది గ్రామ పంచాయతీలను కూడా మున్సిపాలిటీగా చేయడంతో ఈ మండలంలో అసలు గ్రామ పంచాయతీలే ఉండవు. దీంతో ఈ మండలం మొత్తం అర్బన్ మండలంగా రూపుదిద్దుకోనుంది. కాగా జిల్లాలో ప్రస్తుతం 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు కాబోతున్న జిన్నారంతో జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 13కు చేరనుంది.

తీర్మానాలు చేస్తున్న జీపీల స్పెషల్ ఆఫీసర్లు

ఈ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చాలని కోరుతూ ఆయా పంచాయతీలు తీర్మానాలు చేస్తున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేవు. స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే ఈ గ్రామపంచాయతీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్ ఆఫీసర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు కలిసి ఈ తీర్మానాలు చేసి కలెక్టరేట్‌కు పంపారు. ఈ తీర్మానాల ఆధారంగా ఈ పది గ్రామాలతో కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు.



జిన్నారం గ్రామపంచాయతీ

జీహెచ్‌ఎంసీలోకి..?

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిని మరింత విస్తరించాలనే యోచనలో ప్రభుత్వ ఉంది. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న గ్రామపంచాయతీలను ముందుగా మున్సిపాలిటీలుగా మార్చుతోంది. ఇవి మున్సిపాలిటీలుగా మారాక.. ఈ మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు చర్చించుకుంటున్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోనుందని చెబుతున్నారు.

కుప్పలు తెప్పలు ఎన్నాళ్లీ తిప్పలు

పరిష్కారం చూపని ప్రజావాణి

- పెండింగ్‌లో 937 అర్జీలు
- రెవెన్యూ సమస్యలే అధికం
- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి, అధికారులు

సంగారెడ్డిజోన్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు రోజురోజుకు పెరిగిపోతున్నాయే తప్ప అవి పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అధికారలు అర్జీలను స్వీకరిస్తున్నారు. వచ్చిన వాటిలో కొన్నింటిని మాత్రమే పరిష్కరిస్తున్నా.. మిగతావి మాత్రం పెండింగ్‌లోనే ఉండటంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎనిమిది నెలల్లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 1,466మంది ప్రజలు అర్జీలు పెట్టుకోగా.. అందులో 529 సమస్యలు పరిష్కరించగా.. 937 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫలితంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం అధికారుల తీరుతో అభాసుపాలవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒక్కటీ పరిష్కారం కాలేదు..

జిల్లాలోని మున్సిపల్ పరిధిలో వచ్చిన అర్జీలు ఒకటి కూడా పరిష్కారం కాలేదని గణాంకాల బట్టి తెలుస్తుంది. అందోల్–జోగిపేట 8, అమీన్‌పూర్‌లో 84, సంగారెడ్డిలో 22, తెల్లాపూర్‌లో 17, జహీరాబాద్‌లో 11, సదాశివపేటలో 6, బొల్లారంలో ఒకటి చొప్పున అర్జీలు రాగా.. అధికారులు వీటన్నింటినీ పరిష్కారం చూపక పెండింగ్‌లోనే ఉంచారు.

వచ్చిన వారే మళ్లీ వస్తూ...

తమ సమస్యలు పరిష్కా రం కాకపోవటంతో వచ్చిన వారే మళ్లీ మళ్లీ వస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయం వృథా, డబ్బులు ఖర్చు అవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవే ప్రధాన సమస్యలు

ప్రజావాణిలో సుమారు 50కి పైగా శాఖలకు సంబంధించిన అర్జీలు వస్తుంటాయి. ప్రధానంగా ధరణిలో భూ వివరాలు లేకపోవటం, పట్టాపాసు పుస్తకం లేదని, డబుల్ రిజిస్ట్రేషన్, ఉన్న భూమి కంటే ఎక్కువగా, తక్కువగా చూపించటం, పింఛన్ ఇప్పించాలని, రైతుబంధు రావటం లేదని, ఉపాధి కల్పన, రహదారుల మరమ్మతులు, భూముల సర్వే, వేతనాలు రాకపోవటం, ఇళ్ల మంజూరు, మిషన్ భగీరథ, పౌరసరఫరాలు, పంచాయతీశాఖ, మున్సిపల్‌తోపాటు తదితర శాఖలపై ఎక్కువగా సమస్యలు వస్తున్నాయి.

ఇతర శాఖల దరఖాస్తుల వివరాలు

శాఖ పేరు	మొత్తం దరఖాస్తులు	పరిష్కారం అయినవి	పెండింగ్‌లో ఉన్నవి
రెవెన్యూ	835	317	518
మున్సిపల్	149	0	149
ఎంపీడీఓ	89	19	70
డీఆర్‌డీఓ	36	11	25
హౌసింగ్ కార్పొరేషన్	32	12	20
జిల్లా పంచాయతి	20	10	10
సర్వే ల్యాండ్ రికార్డ్స్	12	6	6
పోలీస్ శాఖ	45	5	40
వైద్య ఆరోగ్యం	16	11	5
కాలుష్యం	6	2	4
ఇతరములు	226	136	90
మొత్తం	1,466	529	937

రెవెన్యూ సమస్యలే ఎక్కువ

ప్రజావాణిలో భూములకు సంబంధించిన సమస్యలే అధికంగా వస్తున్నాయి. కొన్ని అర్జీలను అధికారులు ఎందుకు తిరస్కరిస్తున్నారో కూడా తెలియటం లేదని బాధితులు వాపోతున్నారు. తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం మాత్రం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టు 12 నుంచి ఈ ఏడాది మార్చి 24 వరకు పరిశీలిస్తే 835 అర్జీలకు గాను 317 పరిష్కరమయ్యాయి. ఇంకా 518 అర్జీలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

2023లో అర్జీ పెట్టుకున్నా..



పుట్టుక నుంచే వైకల్యంతో ఉన్నాడు. 90%తో సదరం సర్టిఫికెట్ ఉంది. అయినా మా కుమారుడికి పింఛన్ రావటం లేదు. 2023లో ప్రజావాణిలో పెన్షన్ కోసం అర్జీలు పెట్టుకున్నాం. అక్కడి నుంచి డీఆర్‌డీఏ శాఖ అధికారులకు పంపించారు. ఎప్పుడు ఫోన్ చేసినా వస్తుంది అని చెబుతున్నారే తప్ప పింఛను మాత్రం రావటం లేదు.

–కుమారుడు బహదుర్‌ఖాన్‌తో తల్లిదండ్రులు, శివ్వంపేట, పుల్‌కల్ మండలం

ఏడాది నుంచి తిరుగుతున్నా..



మాకు డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలి. దిగ్వాల్ గ్రామ శివారులో ఇల్లు మంజూరు చేస్తూ సర్టిఫికెట్ అందించారు. కానీ ఇల్లు మాత్రం చూపించటం లేదు. అధికారుల దగ్గరకు వెళ్లినా పట్టించుకోవటం లేదు. ఏడాది నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. మా సమస్యను పరిష్కరించాలి.

–స్వప్న, దిగ్వాల్, జహీరాబాద్ మండలం

నాణ్యమైన సన్న బియ్యమివ్వాలి

కలెక్టర్ క్రాంతి ఆదేశం

- లబ్ధిదారులతో కలసి భోజనం
- పేదలు సంతోషంగా ఉన్నారని వ్యాఖ్య



లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో అడిషనల్ కలెక్టర్ మాధురి తదితరులు

సంగారెడ్డి జోన్: నాణ్యతతో కూడిన సన్న బియ్యం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని మూడవ వార్డులో కిట్టు, స్వప్నల ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలసి కలెక్టర్ భోజనం చేశారు. సన్న బియ్యం పంపిణీతో తమ కుటుంబం సంతోషంగా ఉందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రేషన్ షాపును పరిశీలించి, సన్న బియ్యం పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 846 రేషన్ షాపులకు గాను 3లక్షల,78 వేల728 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,999 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. గతంలో దొడ్డు బియ్యం నాణ్యత లేక పోవటంతో రీసైక్లింగ్ చేయడం, ఇతరులకు అమ్మడం జరిగేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు తగిన వసతులు కల్పించాలి

వయో వృద్ధులకు తగిన వసతులు సమకూర్చాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. సంగారెడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వృద్ధాశ్రమం, బాల రక్షాబంధన్‌ను ఆమె సందర్శించారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేయనున్న జనరిక్ మెడికల్ షాపు స్థలాన్ని, ఐకేపీ మహిళల పెట్రోల్ బంక్‌ను కూడా పరిశీలించారు. వృద్ధాశ్రమంలో అవసరమయ్యే మౌలిక సదుపాయాల గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి వనజా రెడ్డి, డీఈఓ దీపక్, డీసీపీఓ రత్నం, ఎఫ్ఆర్ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణిలో అర్జీలు పెట్టుకున్న దివ్యాంగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల ప్రజావాణి నిర్వహించారు. ఈ మేరకు 23 వరకు అర్జీలు వచ్చాయి. సదరం సర్టిఫికెట్, రెన్యూవల్ కోసం సంబంధిత దివ్యాంగులకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సదరం క్యాంపులో స్లాట్ బుకింగ్ కోసం మొబైల్ యాప్‌లో సిటిజన్ స్లాట్ బుకింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. నెలలో రెండుసార్లు సదరం స్లాట్ బుకింగ్, నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వైద్యారోగ్య శాఖ, డీఆర్డీఏ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగూరు కాల్వలకు సింగారం

- రూ.169.30 కోట్లతో సిమెంట్ లైనింగ్
- పనులు ప్రారంభించిన గుత్తేదారు
- కాంక్రీట్ వేయడానికి మార్కింగ్
- ఏడాదిన్నరలో పనులు పూర్తికి ఒప్పందం



కాల్వలో మట్టిని చదును చేసి మార్కింగ్ చేసిన దృశ్యం

పుల్‌కల్(అందోల్): సింగూరు కాల్వలకు సిమెంట్ లైనింగ్ పనులు ప్రారంభమయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మొదట కాల్వల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి కొలతల ప్రకా రం మట్టిని తీసేశారు. కాల్వలకు కాంక్రీట్ పోయడానికి వీలుగా మార్కింగ్ చేస్తున్నారు. దశాబ్దం క్రితం నుంచి సాగునీరు అందిస్తున్న కాల్వలకు నీటి పారుదలశాఖ అధికారులు ఇప్పటివరకు మరమ్మతు లు చేయలేదు. దీంతో కాల్వల్లో మట్టి పేరుకుపోయి ముళ్లకంప మొలిచింది. దీంతో మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకొని కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయడానికి నిధులు మంజూరు చేశారు.

రూ.169.30 కోట్లతో మరమ్మతులు

సింగూరు డ్యామ్‌కు కుడి, ఎడమన 60 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ, 160 కిలోమీటర్ల మేర డైవర్షన్ కెనాల్‌లు ఉన్నాయి. దశాబ్దం నుంచి మరమ్మతులు చేయకపోవడంతో కాల్వల్లో పిచ్చి మొక్కలు మొలిచి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరందక చౌటకూర్, అందోల్ మండలాల్లోని పిల్ల కాల్వలకు నీరందడం లేదని రైతులు పేర్కొన్నారు. తన నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టు ఉండటంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్షించి సిమెంట్ లైనింగ్ మరమ్మతులకు రూ.169.30 కోట్లు మంజూరు చేశారు. అధికారులు రూ.133.51 కోట్లకు టెండర్ ప్రక్రియ ప్రారంభించగా.. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ 4.95 ఎక్సెస్‌తో పనులు దక్కించుకున్నారు. ఈ పనులకు కాంట్రాక్టర్ 18 నెలలకు అగ్రిమెంట్ చేసుకున్నారు.

పంటలకు క్రాప్ హాలిడే..

కాగా, కాల్వల్లో నీటి ప్రవాహం ఉంటే పనులకు ఆటంకం కలుగుతుందని ఆయకట్టు కింద రెండు పంటలకు సాగునీరు వదలడం లేదు. దీంతో బోరు బావులతోనే సాగు చేసుకున్నారు. సిమెంట్ లైనింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నారు.

25మంది నాయబ్ తహసీల్దార్ల బదిలీ



సంగారెడ్డి జోన్: జిల్లాలో 25మంది నాయబ్ తహసీల్దార్‌లను బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న నాయబ్ తహసీల్దార్లను ఇతర మండలాలతో పాటు ఆర్డీఓ, సివిల్ సప్లై, ఎలక్షన్ కార్యాలయాలకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ స్థానం	పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ స్థానం
భానుప్రకాశ్ శర్మ	ఆర్డీఓ, జహీరాబాద్	అందోల్ (ఎలక్షన్)	జుబేర్ అహ్మద్	కంగ్టి	మొగుడంపల్లి
		యూడీ కలెక్టరేట్	మర్రి ప్రదీప్	కొండాపూర్	మునిపల్లి
హేమంత్‌కుమార్	డీఎస్ఓ సంగారెడ్డి	కలెక్టరేట్ సంగారెడ్డి(ఎలక్షన్)	యాసీన్ ఖాన్	ఝరాసంగం	నిజాంపేట
సంతోష్‌కుమార్	పటాన్‌చెరు(ఎలక్షన్)	డీఎస్ఓ సంగారెడ్డి	అరుణోదయచారి	సిర్గాపూర్	పటాన్‌చెరు(ఎలక్షన్)
సుజాత చౌహాన్	ఆర్డీఓ అందోల్ జోగిపేట	డీఎస్ఓ సంగారెడ్డి	సతీష్‌కుమార్	ఆర్డీఓ నారాయణఖేడ్	పుల్‌కల్
సల్ల మల్లయ్య	కంది	గుమ్మడిదల	శంబిరెడ్డి	వట్‌పల్లి	ఆర్డీఓ, అందోల్ జోగిపేట
దావుద్ అహ్మద్	డీఎస్ఓ సంగారెడ్డి	హత్నూర	ఆకుల వీరేశం	సదాశివపేట	ఆర్డీఓ నారాయణఖేడ్
కరుణాకర్‌రావు	గుమ్మడిదల	ఝరాసంగం	బాల్‌రాజ్	కల్హేర్	సదాశివపేట
పవన్‌కుమార్	మొగుడంపల్లి	కల్హేర్	చంద్రశేఖర్	అందోల్(ఎలక్షన్)	వట్‌పల్లి
మన్నె కిరణ్‌కుమార్	పుల్‌కల్	కంది	సుకుమారి	డీఎస్‌ఏ సంగారెడ్డి	జహీరాబాద్(ఎలక్షన్)
అబ్దుల్ ముగ్ని	మనూర్	కంగ్టి	కృపదానం	మునిపల్లి	జహీరాబాద్
వినయ్‌కుమార్	హత్నూర	కొండాపూర్	రాజు	నారాయణఖేడ్(ఎలక్షన్)	ఆర్డీఓ, సంగారెడ్డి
ఆదర్శ్‌కుమార్	జహీరాబాద్(ఎలక్షన్)	మనూర్	సతీష్	జహీరాబాద్	ఆర్డీఓ, జహీరాబాద్

మోదం.. ఖేదం


టమాటా కిలో రూ.2 నుంచి రూ.5

- తెంపకుండా చేలల్లోనే వదిలేస్తున్న రైతులు
- దారెత్తిస్తున్న నిమ్మ కాయలు
- ధర ఉన్నా.. కాతలేని వైనం

నారాయణఖేడ్: మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో తెలీదు. ఏ వస్తువుకు ధర పలుకుతుందో.. ఏ వస్తువు ధర పడిపోతుందో చెప్పలేని స్థితి. వ్యాపారుల మార్కెట్ మాయాజాలంలో రైతులు సమిధలవుతున్నారు. ఆరుగాలం కష్టించిన కష్టాలకు ఫలితం దక్కక అనాదిగా నష్టపోవడం రైతు వంతవుతుంది. సరిగ్గా ఏడాది క్రితం కిలో టమాటా రూ.100 నుంచి ఆ పైగా పలుకగా నేడు అదే టమాటా కొనేవారే లేరు. కిలో రూ.2 నుంచి రూ.5లోపే రైతును అడగడంతో పంటను కోయలేక చేలల్లోనే వృథాగా పడేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో టమాటా పంట సాగు చేసిన రైతుల కంట కన్నీరు తెప్పిస్తుంది. కనీసం రవాణా చార్జీలు కూడా రాకపోవడంతో చేలల్లో తెంపకుండా వదిలేయడం, లేదా రోడ్లపై పారబోస్తున్నారు. దిగుబడి పెరిగి కష్టాలు తీరుతాయని ఆశించిన రైతులు మార్కెట్లో ధర చూసి ఆవేదన చెందుతున్నారు. దాదాపు రెండుమూడు నెలల నుంచి టమాట ధర పతనమై రైతుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తుంది. ఈ ధరతో లాభాలు దేవుడెరుగు కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఆశించిన మేర ధరలు లేకపోవడంతో రైతులు పొలాల్లోనే పంట వదిలేస్తున్నారు.



నిమ్మకాయలు



మార్కెట్‌లో టమాట

వ్యాపారులు మాత్రం కిలో టామాట రూ.10 నుంచి మొదలు కొని రూ.20, రూ.30వరకు అమ్ముతున్నారు. మార్కెట్‌కు తీసుకొచ్చే 22 నుంచి 24కిలోలు గల బాక్సుకు ధర రూ.40 నుంచి రూ.60 మాత్రమే రైతుకు లభిస్తుంది. ఈ ధరతో తమకు గిట్టుబాటు కావడంలేదని రైతులు పేర్కొంటున్నారు. టమాటా ఎకరా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు రూ.70 వేల నుంచి రూ.80వేల వరకు రైతు ఖర్చు చేస్తున్నాడు. ఎకరాలో 3 టన్నుల వరకు దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో రైతు వద్ద కిలో రూ.2 నుంచి రూ.5లోపే కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్‌లో వంకాయ పంట ధర కూడా అంతంతగానే ఉంది. ఆకుకూరల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఏ కూరగాయ ధర చూసినా రైతు వద్ద వ్యాపారులు కిలో రూ.20 నుంచి రూ.30లోపే కొనుగోలు చేస్తున్నారు. చిల్లరగా ఆకుకూరలు వినియోగదారుకు రూ.10కి రెండు కట్టల చొప్పున మెంతికూర, పాలకూర, చుక్కకూర ఇత్యాధి ఆకు కూరలు అమ్ముతున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో టమాటా 900 ఎకరాల్లో, జహీరాబాద్‌లో 600, జోగిపేట 400, సంగారెడ్డిలో 300 ఎకరాల్లో టమాటా సాగు జరుగుతుంది.

కిలో నిమ్మ రూ.200

కాగా నిమ్మ కాయలకు మంచి ధర పలుకుతుంది. కిలో నిమ్మకాయలు 150 నుంచి రూ.200 పలుకుతున్నాయి. నిమ్మకాయలు కిలోకు 15 నుంచి 20లోపే తూగుతాయి. ఈ లెక్కన చిన్న కాయలు రూ.5, కాస్త పెద్దగా ఉన్న కాయలు రూ.10వరకు అమ్ముతున్నారు. ఖేడ్ మార్కెట్‌లో నిమ్మకాయలు కిలో రూ.200వరకు పలకడంతో ధరలు చూసి విస్తుపోతున్నారు. కాగా చేలల్లో ఉన్న నిమ్మ చెట్లకు అంతగా కాతలేదు. ఉన్న కాస్త కాతను ధర ఉండటంతో కోసి అమ్మేస్తున్నారు.

చేలో వదిలేశా..



ఎకరం భూమిలో టమాటా పంట సాగు చేశా. మొదట ధర కొంత గిట్టుబాటుగా ఉన్నా పక్షం రోజులుగా ధరలు పడిపోయాయి. ప్రస్తుతం పెట్టె టమాటాకు రూ.40 నుంచి 60లోపే వస్తుంది. ఆడమనిషి కూలీ రూ.300 పెట్టి తెంపిస్తే 8 పెట్టెలు వస్తున్నాయి. ఈ లెక్కన కూలీ, రవాణా చార్జీలు కలిపితే నేనే నష్టపోవాల్సి వస్తుంది. దీంతో పంట కోయకుండా చేలోనే వదిలేశాను. అలాగే ఎండిపోతుంది.

– తిప్పయ్య, రైతు, పైడిపల్లి

ధాన్యం దళారుల పాలు



ఈ ఫొటోలో కని పిస్తున్న రైతు తోటపల్లి గ్రామానికి చెందిన రాంగోపాల్‌రావు. వారం రోజుల కిందట వరి కోసి నాలుగు ట్రాక్టర్లలో 50 క్వింటాళ్ల ధాన్యం మిల్లుకు తీసుకుపోయిండు. వ్యాపారులు తాలు సాకు చూపి క్వింటాల్‌కు 5 కిలోల ధాన్యం కోత పెట్టారు. 50 క్వింటాళ్లకు 2.5 క్వింటాల్‌లు కోత పెట్టడంతో రూ.4,500 నష్టం జరిగింది. అలాగే ప్రభుత్వ మద్దతు క్వింటాల్‌కు రూ.2,320 ఉంటే వ్యాపారులు మాత్రం రూ.1,800కి కొన్నారు. ఇందులోనూ రూ.500 వ్యత్యాసంతో 50 క్వింటాళ్లకు రూ.25,000 నష్టం పోయాడు. అనంతరం హమాలీ ఖర్చుల కింద క్వింటాల్‌కు రూ.40 చొప్పున 50 క్వింటాళ్లకు రూ.2,000 తీసుకున్నారు. మొత్తంగా 50 క్వింటాళ్ల ధాన్యం అమ్మితే రూ.31,500 నష్టపోయాడు. డబ్బులకు 12 రోజులు వాయిదా పెట్టారు. ఇది ఒక రాంగోపాల్‌రావు కష్టమే కాదు మిల్లుకు ధాన్యం తీసుకొచ్చే ప్రతీ రైతులందరిది ఇదే పరిస్థితి.



పందిల్ల మిల్లు వే బ్రిడ్జిపై తూకం వేస్తున్న ధాన్యం ట్రాక్టర్లు

తూకంలో మోసం, ధరలో వ్యత్యాసం

- క్వింటాల్‌కు రూ.500ల తేడా
- తాలు సాకుతో క్వింటాల్‌కు 5 కిలోలు కోత విధిస్తున్న వైనం
- రైతులను నిలువునా ముంచుతున్న వ్యాపారులు
- క్షేత్రస్థాయిలో గమనించని అధికారులు

హుస్నాబాద్‌రూరల్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం దళారుల పాలవుతోంది. రైతులకు ధర తక్కువగా చెల్లించి నిలువునా దోచుకుంటున్నారు. వరి కోసం మిల్లులకు ధాన్యం తెచ్చిన తర్వాత ధాన్యం పచ్చిగా ఉందని, తాలు సాకు చూపించి క్వింటాల్ రూ.100 కోత పెడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320లు ఉంటే వ్యాపారులు రూ.1760కే కొనుగోలు చేసి క్వింటాల్‌కు రూ.560 లాభం పొందుతున్నారు. రైతులు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొస్తే మిల్లులోని వే బ్రిడ్జి పై ధాన్యం తూకం వేస్తారు. బయటి వే బ్రిడ్జిలకు మిల్లుల వే బ్రిడ్జిలకు 10 నుంచి 20 కిలోల వ్యత్యాసం చూపిస్తుందని రైతులు వాపోతున్నారు. మార్కెటింగ్ అధికారులు ఎప్పుడు మిల్లుల వే బ్రిడ్జిలను తనిఖీ చేయరు. రైతుల ఫిర్యాదు మేరకు మిల్లులకు వచ్చిన అధికారులు ముడుపుల ఆశ చూపించి పంపిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

పత్తి అమ్మిన రైతుల పేరునే ధాన్యం అమ్మకాలు

హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 29 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా 19 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలు లేని రైతులు దళారులను ఆశ్రయించడంతో వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. శనివారం రోజు గోమాత కాటన్ మిల్లులో ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారులు రైతులకు ధర చెల్లింపులో కోతలు పెట్టడంతో ఆగ్రహించి ఆందోళనకు దిగారు. రైతులను శాంతింప చేసిన వ్యాపారులు క్వింటాల్‌కు రూ.1800లు చెల్లించడంతో రైతులు అందోళన విరమించారు. పత్తి మిల్లులో ధాన్యం కొనుగోలు చేయరాదు. పార బాయిలర్ మిల్లులోనే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం బోగస్ రైతుల పేరున ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి లాభాలను పొందుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారు. మిల్లులను తనిఖీ చేసి రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యం పరిశీలించాల్సి బాధ్యత లేదా.? అధికారులు వ్యాపారులు ఇచ్చే ముడుపులకు ఆశపడితే రైతులు దోపిడీ గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అక్కడే రైతులు ధాన్యం అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి. దోపిడీ చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోకపోతే మిల్లుల ముందు రైతులతో ఆందోళనకు దిగుతాం.

- మల్లికార్జున్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు

అధికారులతో తనిఖీలు చేయిస్తాం



రైతులు పచ్చివడ్లు అమ్ముకోవద్దు. గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలని చెబుతున్నాం. కొందరు రైతులు ఆరబెట్టడం ఏంటని చేనులోనే వరి కోసిన వెంటనే మిల్లుకు తీసుకుపోతున్నారు. వ్యాపారులకు ఇది వరకే చెప్పాం. రైతుల ధాన్యం కొనుగోలు చేయొద్దని ఒక వేళ చేస్తే మద్దతు ధర చెల్లించాలని చెప్పినాం. తూకములో మోసం గురించి అధికారులతో తనిఖీ చేయించి చర్యలు తీసుకుంటాం.

- టీ.తిరుపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్,హుస్నాబాద్

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



నిందితుడితో పోలీసులు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పటాన్ చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీనివాస్ రెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో సోమవారం మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇందులో 756 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన లాలన సహానిగా గుర్తించారు. దాడుల్లో సీఐ గాంధీ నాయక్, ఎస్సై యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ హలీం, కానిస్టేబుళ్లు కరీం, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



బాలిక ప్రీతి

జహీరాబాద్ టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన జహీరాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. టౌన్ ఎస్ఐ కాశీనాథ్ కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రానికి చెందిన హన్మంత్‌రావు పట్టణంలోని జేసీ బ్రదర్స్ షాపింగ్ మాల్ పని చేస్తున్నాడు. పట్టణంలోని నాగులకట్టలో అద్దె ఇంట్లో నివాసం ఉంటుండగా భార్యాపిల్లలు స్వగ్రామమైన నిర్నలో ఉంటున్నారు. హన్మంత్‌రావు ఆరోగ్యం దెబ్బతినగా తండ్రిని చూడటానికి కూతురు ప్రీతి మార్చి 29న జహీరాబాద్‌కు వచ్చి ఇక్కడే ఉంది. హన్మంత్‌రావు 5న యధావిధిగా డ్యూటీకి వెళ్లాడు. విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికొచ్చి సరికి కూతురు ప్రీతి కనిపించలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం జహీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కల్వర్టును ఢీకొట్టిన బైక్

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మైపాల్ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): కల్వర్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని బిజిలీపూర్, మర్వెల్లి గ్రామాల సరిహద్దులో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. మర్వెల్లి గ్రామానికి చెందిన తలారి మైపాల్(35), జోగొళ్ల మొగులయ్య ఒకే బైక్‌పై బిజిలీపూర్ వైపు వెళ్తున్నారు. రెండు గ్రామాల సరిహద్దు శివారులో నిర్మించిన కల్వర్టును బైక్ బలంగా ఢీకొట్టింది. బైక్ వెనుకాల కూర్చున్న మైపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మొగులయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటోని ఢీకొట్టిన ట్రాక్టర్

11 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వెల్దుర్తి(తూప్రాన్): ఆటోని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో 11 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్– వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో మెదక్ వైపు పనికి వెళ్లి తిరిగి ఆటోలో గ్రామానికి వస్తున్నారు. మండల పరిధి కుకునూరు గ్రామ శివారులో వెనుక నుంచి ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోని 11 మందికి గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కంది(సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కందిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం కంది గ్రామం బయట జాతీయ రహదారిపై మద్యం తాగి ఓ వ్యక్తిపడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెళ్లి పరిశీలించి 108 అంబులెన్స్ ద్వారా ఆ వ్యక్తిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించాం. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు జీన్స్ ప్యాంట్, బ్లూ కలర్ చెక్స్ షర్ట్, బూట్లు ధరించి ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలోనే భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రూరల్ ఎస్ఐ 87126 56746 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



అదుపుతప్పి గూడ్స్ ఆటో బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): అదుపుతప్పి గూడ్స్ ఆటో బోల్తా పడిన ఘటన కొండపాక గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వరంగల్ కాజీపేట నుంచి ఆయిల్ ప్యాకెట్లను లోడ్ చేసుకొని గూడ్స్ ఆటో హైదరాబాద్‌లోని నాగోల్‌కు వెళ్తుంది. కొండపాక శివారులోని మెదక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అదుపుతప్పి రాజీవ్ రహదారిపై పల్టీ కొట్టి బోల్తా పడింది. ఆటోలో ఉన్న రామకృష్ణ, డ్రైవర్ నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

నంగునూరు(సిద్దిపేట): పట్ట పగలే దొంగలు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం వెంకటాపూర్‌లో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రేకులపల్లి శ్యామల ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.15 వేల నగదు, రెండున్నర తులాల బంగారం దోచుకెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న శ్యామల దొంగతనం జరిగినట్లు గుర్తించి రాజగోపాల్‌పేట పోలీసులకు సమాచారం అందించడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిని వేధిస్తున్నాడనే యువకుడి హత్య

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

జహీరాబాద్: తన తల్లిని తరచూ ఫోన్‌లో వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఇద్దరు నిందితులు యువకుడిని దారుణంగా హత్య చేశారు. మంగళవారం చిరాగ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు. మొగుడంపల్లి మండలంలోని ధనాసిరి గ్రామానికి చెందిన అబ్బాస్‌అలీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఖలీషా అనే వ్యక్తి తల్లిని అబ్బాస్‌అలీ తరచూ బూతులు తిడుతుండేవాడు. ఫోన్ చేసి చేసి వేధించేవాడు. ఈ విషయమై ఖలీషా పలుమార్లు అబ్బాస్‌ను హెచ్చరించాడు. అయినా వేధింపులు మానుకోలేదు. ఇదే విషయాన్ని ఖలీషా తన స్నేహితుడు మహతాకు చెప్పాడు. దీంతో ఇద్దరూ కలిసి అబ్బాస్‌అలీని చంపాలనుకున్నారు. 6న అబ్బాస్‌అలీ గ్రామ శివారులోని ఓ ఫాంహౌస్‌లో ఉన్నాడని తెలిసింది. ఖలీషా, మహతాబ్‌లు మారణాయుధాలతో మోటారుసైకిల్‌పై వెళ్లి అబ్బాస్‌పై దాడి చేసి హత్య చేశారు. అడ్డుగా వచ్చిన అబ్బాస్ స్నేహితుడు షేక్ అబ్బాస్‌అలీ ముఖంపై బీర్ బాటిల్‌తో కొట్టి గాయపర్చారు. అనంతరం పారిపోతూ శేఖర్ అనే వ్యక్తిని దారిలో అడ్డగించి ఎయిర్ గన్, హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను చూపించి బెదిరించి మోటారు సైకిల్‌ను తీసుకొని పరారయ్యారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని పుగట్‌నగర్‌లో మహతాబ్ ఇంటి వద్ద నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ శివలింగం, ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

ఫోన్ కొనివ్వడం లేదని ఆత్మహత్య

రైలు కిందపడి ఛత్తీస్‌గఢ్ యువకుడి బలవన్మరణం

కొమురవెల్లి(సిద్దిపేట): సెల్‌ఫోన్ కొనివ్వడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గౌరయపల్లి శివారులోని రైల్వే ట్రాక్‌పై చోటు చేసుకుంది. ఆర్‌పీఎస్ నిజామాబాద్ ఎస్ఐ సాయిరెడ్డి, స్థానికుల కథనం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఖబర్ధ జిల్లాలోని కర్జీది గ్రామానికి చెందిన రూపేశ్(18) కుటుంబ సభ్యులతో కలిసి కొండపాక మండలం దుద్దెడలో మేస్త్రీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. రూపేశ్ తనకు ఫోన్ కొనివ్వాలని సోమవారం కుటుంబ సభ్యులను అడుగగా తిరస్కరించారు. దీంతో గొడవపడి అదే రోజు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. మంగళవారం ఉదయం గౌరయపల్లి గ్రామ శివారులో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడని సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి

జహీరాబాద్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద గ్రామానికి చెందిన భీంషు(35) శేఖాపూర్ శివారులోని జయశీల ఇటుకబట్టీలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ అక్కడే కూలీ పనులు చేస్తున్నాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజులుగా అతిగా మద్యం సేవించి భార్య భారతితో గొడవపడ్డాడు. జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి

పాపన్నపేట(మెదక్): పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లక్ష్మీనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన ముచ్చ సుబ్బారావు (64) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఐదేళ్ల కిందట కొడుకు మృతి చెందాడు. భార్య వీరమణి కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతుంది. దీంతో సుబ్బారావు తీవ్ర మనస్తాపం చెంది 6న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని రేకుల షెడ్డు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



శివకుమార్(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన బేడబుడగ జంగాల దుర్గయ్య కుమారుడు శివకుమార్(30) గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ గ్యాస్ స్టవ్, మిక్సీ కుక్కర్‌లు బాగు చేస్తుంటాడు. సోమవారం చేగుంట మండలం మక్కరాజ్‌పేటలో గ్యాస్ స్టవ్ రిపేర్ చేసేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. ఎక్సెల్‌పై నార్సింగి జాతీయ రహదారిపై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి కుంటలో పడి యువకుడు



సురేశ్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): నీటి కుంటలో పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. టేక్మాల్ మండలం దన్నూర గ్రామానికి చెందిన నాయికిని సురేశ్(25) ముస్లాపూర్ గ్రామానికి చెందిన మమతతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది.పెళ్లి చేసుకొని ఇల్లరికం అల్లుడిగా వెళ్లారు. సోమవారం సురేశ్ అదే గ్రామానికి చెందిన ఆగమయ్య, సంగమేశ్‌తో కలిసి సీతారామా కుంటలో ఎడ్లను కడగడానికి వెళ్లారు. సురేశ్ కుంటలో మునిగిపోయాడని ఆగమయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే సురేశ్‌ను బయటికి తీసి జోగిపేట ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సురేశ్ మృతిపై అనుమానం ఉందని తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పారిశ్రామిక వాడలో సెక్యూరిటీ గార్డు

మనోహరాబాద్(తూప్రాన్): అనారోగ్యంతో పారిశ్రామిక వాడలో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. మంగళవారం ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన రాజు గాంధీ (58) ఆరు నెలల నుంచి మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక వాడలో మూతపడిన తనయ్ ఎకోవేర్స్ విస్తరాకుల పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. షిఫ్ట్ ఛేంజ్‌లో భాగంగా సోమవారం తెల్లవారుజామున తోటి సెక్యూరిటీ గార్డ్ అరుణ్ మిశ్రా పరిశ్రమ వద్దకు వచ్చాడు. అప్పటికే సెక్యూరిటీ రూం వద్ద రాజు గాంధీ కిందపడి మృతి చెంది ఉన్నాడు. వెంటనే మృతుడి కుటుంబీలకు, పరిశ్రమ యజమానికి సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందాడని మృతుడి కుమారుడు శివరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్నాటకలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు న్యాల్‌కల్ మండలవాసులు మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): కర్నాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాల్‌కల్ మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రత్నాపూర్ గ్రామానికి చెందిన ఇస్మాయిల్(24), మున్నూర్ రమేశ్(44), చాకలి బస్వరాజ్ నిత్యం కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఎప్పటిలాగే ముగ్గురు కూలీ పనుల నిమిత్తం కర్నాటకలోని బాల్కికి వెళ్లారు. 6న మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తున్నారు. ఖానాపూర్ సమీపంలో టెంపో ట్రావెల్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్ర గాయాలైన బస్వరాజ్ గాంధీలోనే చికిత్స పొందుతున్నాడు.

నౌక నిర్మాణ రంగంలో ఏఐ సాంకేతికత

గోవా షిప్‌యార్డుతో ఐఐటీహెచ్ ఒప్పందం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి నౌకల నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు, సరికొత్త ప్రమాణాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్ (ఐఐటీహెచ్) గోవా షిప్‌యార్డు లిమిటెడ్ (జీఎస్ఎల్) కంపెనీతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఐఐటీహెచ్‌లోని సెంటర్ ఫర్ జియో స్పేషియల్ ఏఐ అండ్ ట్వీన్స్ (సీజీడీటీ) విభాగం నైపుణ్యాన్ని జీఎస్ఎల్ వినియోగించుకోనుంది. సముద్ర కార్యకలాపాలలో సామర్థ్యం పెంచుకోవడం.. షిప్‌యార్డు భద్రతను బలోపేతం చేయడం.. 360 డిగ్రీల నిఘా కార్యాకలాపాలు అమలు చేయడం వంటి కార్యకలాపాల విషయంలో ఈ రెండు సంస్థలు కలిసి పని చేయనున్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్. మూర్తి మాట్లాడుతూ ఈ అధునాతన సాంకేతిక వినియోగం అనే అంశం భారతదేశంలోనే కాకుండా, ఆసియాలో తొలి ప్రయత్నమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ సంస్థ సీఎండీ బీకే ఉపాధ్యాయ్, ఏఎంఎస్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ దిట్టకవి చక్రపాణి, నీర్ ఇంటరాక్టివ్ సొల్యూషన్స్ సీఈఓ జైశంకర్ పాల్గొన్నారు.



హైదరాబాద్ ఐఐటీహెచ్

వ్యక్తిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): ఆవుని చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల పరిధి లింగోజిగూడ తండాకు చెందిన రైతు రమేశ్ పశువులను పాకాలో కట్టేశాడు. గత నెల 31న అర్ధరాత్రి మందలోంచి ఓ ఆవు చోరీకి గురైంది.బాధిత రైతు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలో పశువుల చోరీకి పాల్పడిన శివ్వంపేటకు చెందిన పశువుల వ్యాపారి కటికె అజీజ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు.

చివరికి బుగ్గిపాలు



కాలిపోయిన వరి పంటను చూపుతున్న రైతు ఎల్లయ్య



దగ్ధమైన పైపులు, సర్వీస్ వైర్

- విద్యుదాఘాతంతో 30 గుంటల వరి దగ్ధం
- పైపులు, మోటార్ కాలిబూడిద
- రూ. 3 లక్షల వరకు నష్టం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటంతా విద్యుదాఘాతంతో బుగ్గి పాలైంది. ఈ ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన తొందూరు ఎల్లయ్య వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పడిన షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో 30 గుంటల వరి పంటంతా కాలిపోయింది. పైపులు, బోరు మోటారు, 100 మీటర్ల సర్వీస్ వైర్, తదితర వస్తువులు కాలిపోయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలార్పేశాడు. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

మట్టి పరీక్ష.. పంటకు రక్ష

- భూసార పరీక్షలు చేయిస్తేనే అధిక దిగుబడి
- అవసరం మేరకు ఎరువులు వాడితేనే మేలు
- రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు



చిన్నకోడూరులో మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటలు సాగు చేసే రైతులు మేలైన దిగుబడి సాధించాలంటే భూమి సారవంతంగా ఉండాలి. అయితే ఏ భూమిలో ఎంత మేరకు పోషకాలున్నాయనే విషయం భూసార పరీక్షలతోనే తేలిపోతుంది. భూములు ఖాళీగా ఉన్నందున భూసార పరీక్షలకు ఇదే సరైన సమయమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ఆవశ్యకతను వివరిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మండలంలో 5,391 మట్టి నమూనాలు సేకరించినట్లు ఏఓ జయంత్ కుమార్ తెలిపారు.

2 నుంచి 3 ఏళ్లకోసారి చేయించాలి

నేలలో అనేక పోషకాలు ఉంటాయి. కానీ పంటల దిగుబడి కోసం వ్యాపారులపైనే ఆధారపడుతున్న పలువురు రైతులు అదనంగా సేంద్రియ, రసాయనిక ఎరువులను వాడుతున్నారు. తద్వారా సాగు ఖర్చు పెరగడమే కాక నేల తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఇలా జరగొద్దంటే ప్రతీ రైతు 2 నుంచి 3 ఏళ్ల కోసారి భూసారాన్ని తెలుసుకోవాలి. తద్వారా అవసరమైన ఎరువులు వాడితే ఫలితం ఉంటుంది. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలిసిపోతుంది. సమస్యాత్మకమైన భూములు ఉంటే వాటిని సవరించుకునే విధానాలు తెలుసుకోవచ్చు.

ఫలితాల ఆధారంగా..

భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని ఉదజని, లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే వీలు ఉంటుంది. దీని ద్వారా అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. రైతులు భూమిని కాపాడుకునేందుకు మట్టి పరీక్షలు తప్పక చేయించుకోవాలని సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో మేలు..

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు తమ భూమిలో భూసార పరీక్షలను ప్రతీయేటా చేయించుకోవాలి. భూమికి కావాల్సిన పోషక విలువలు తెలుసుకోవచ్చు. ఆపై అవసరమున్నంత ఎరువులను ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

- జయంత్ కుమార్, ఏఓ, చిన్నకోడూరు